# అక్రమ కేసులకు భయపడవద్దు



బీఆర్ఎస్ కార్యకర్తతో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు

- బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటాం
- మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

మల్లాపూర్, ఫిబ్రవరి 5: కాంగ్రెస్ నాయకులు పెడుతున్న అక్రమ కేసులకు బీఆర్ఎస్ కార్యకర్తలు ఎట్టి పరిస్థితుల్లో భయపడవద్దని మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఇటీవల నిర్వహించిన గ్రామసభలో గొడవ జరుగగా, బీఆర్ఎస్‌కు చెందిన ఐదుగురిపై కేసు నమోదైంది. కాగా, బుధవారం వారిని మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఏర్పాటు కోసం ఉద్యమం చేపట్టి, ఎన్నో పోలీసు కేసులను ఎదుర్కొన్న ఘనత కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారం ఉపయోగించి పోలీసుల సహకారంతో తమ కార్యకర్తలపై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. కేసుల విషయంలో బీఆర్ఎస్ నేతలకు, బాధిత కుటుంబ సభ్యులకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వేంపేట నర్సారెడ్డి, నాయకులు బండి లింగస్వామి, మ్యాకల సతీశ్, చిట్యాల లక్ష్మణ్, బదినపల్లి ప్రేమ్, కోడూరి బిక్షపతి, దేవ మల్లయ్య, మారు సాయిరెడ్డి, నల్ల రాజేశ్వర్, కొంపల్లి రాజు, డబ్బ రమేశ్‌రెడ్డి, కొప్పెల రాజశేఖర్, సుద్దపల్లి లింగమూర్తి, బద్ధం వెంకట్, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న టాస్క్ శిక్షకురాలు కౌసల్య బాయి

## ముగిసిన శిక్షణ

జగిత్యాల, ఫిబ్రవరి 5: జగిత్యాలలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో టాస్క్ ఆధ్వర్యంలో '21వ సెంచరీ ట్రాన్స్‌ఫరబుల్స్ స్కిల్స్'పై మూడు రోజులుగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా టాస్క్ శిక్షకురాలు డాక్టర్ కౌసల్య బాయి వివిధ అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రమోద్‌కుమార్, టీఎస్‌కేసీ కో-ఆర్డినేటర్ నీరజ, వైస్ ప్రిన్సిపాల్ చంద్రయ్య, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ వాసవి, రామచంద్రం, డాక్టర్ శ్రీలత, తిరుపతి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ లాజిస్టిక్స్ కార్గో సేవలపై అవగాహన




ర్యాలీ తీస్తున్న ఆర్టీసీ కార్గో సిబ్బంది

జగిత్యాల, ఫిబ్రవరి 5: జగిత్యాల బస్టాండ్ నుంచి మార్కెట్ రోడ్డు వరకు ఆర్టీసీ లాజిస్టిక్స్ కార్గో సేవలపై సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. కార్గో సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆర్టీసీ సిబ్బంది మాట్లాడుతూ, కార్గో సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. హోమ్ డెలివరీ కౌంటర్, డెలివరీ పార్సిళ్లు ప్రారంభిస్తున్నామని, ఈ సేవలు బెంగళూర్, నాగపూర్, పూణే, కర్ణాటక, తెలుగు రాష్ట్రాల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్గో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు బావిలో పడి బాలుడి మృతి

వెల్గటూర్, ఫిబ్రవరి 5: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ బాలుడు మృతి చెందిన ఘటన ఎండపల్లి మండలం గుల్లకోటలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుల్లకోటకు చెందిన మంత్రి రంజిత్‌కుమార్-శిరీష దంపతులు ప్రేమ వివాహం చేసుకొని స్థానికంగా అద్దెకు ఉంటున్నారు. వీరికి కుమారులు మహేశ్వన్, వేదాన్ష్ (18 నెలలు) ఉన్నారు. వేదాన్ష్ ఆడుకుంటూ పక్కనే ఉన్న అమ్మమ్మ ఇంటికి తరచూ వెళ్తుండే వాడు. కాగా, బుధవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో శిరీష ఇంట్లో పని చేసుకుంటూ ఉండగా, వేదాన్ష్ అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. దారిలో బావి ఉండగా ప్రమాదవశాత్తు అందులో పడ్డాడు. అమ్మమ్మ ఇంటికి వెళ్లి ఉంటాడని తల్లి, అమ్మ వద్దనే ఆడుకుంటున్నాడని అమ్మమ్మ అనుకున్నారు. ఎంత సేపటికి కనిపించకపోవడంతో శిరీష బావి పక్క నుంచి వెళ్తుండగా అందులో బాలుడి మృతదేహం తేలి కనిపించింది. చిన్నారి మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.



వేదాన్ష్ (ఫైల్)

## భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలి

కొడిమ్యాల, ఫిబ్రవరి 5: నల్లగొండ లక్ష్మీనరసింహ స్వామి జాతరకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈనెల 8 నుంచి జరిగే జాతరకు సంబంధించి ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భక్తులకు వసతులు కల్పించడంతో పాటు ఆలయ పరిసరాలు శుభ్రంగా ఉంచాలని ఎంపీడీవోకు సూచించారు. మేడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, ఇన్‌చార్జి డీపీవో మదన్‌మోహన్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, ఆలయ ఈవో వెంకన్న, తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో స్వరూప, గ్రామ ప్రత్యేకాధికారి, ఏవో జ్యోతి, జూనియర్ అసిస్టెంట్లు కమలాకర్, రవి, పంచాయతీ కార్యదర్శులు సాయిలు, చంద్రశేఖర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## 'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

కొడిమ్యాల, ఫిబ్రవరి 5: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి రాము సూచించారు. మండలంలోని పూడూర్ జడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ, ఒక్కో విద్యార్థిని అధ్యాపకులు దత్తత తీసుకొని, మంచి ఫలితాలు వచ్చేలా కృషి చేయాలన్నారు. అనంతరం పాఠశాలలో రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా అధ్యక్షురాలిగా శారద



శారద

ధర్మపురి, ఫిబ్రవరి 5: తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలిగా ధర్మపురికి చెందిన భీమనాతి శారద నియమితులైనట్లు తెలుగు వెలుగు సాహితీ వేదిక చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా శారదకు పలువురు అభినందనలు తెలిపారు.

## చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



గంగాధర్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 5: మండలంలోని వేములకుర్తి గ్రామానికి చెందిన బోదాసు గంగాధర్(15) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... బోదాసు గంగాధర్ వేములకుర్తి ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. గంగాధర్ చెడు తిరుగుళ్లు తిరుగుతున్నాడని, బడికి వెళ్లి మంచిగా చదువుకోవాలని బుధవారం తల్లి రాజవ్వ మందలించి వ్యవసాయ పనులకు వెళ్లింది. ఈ క్రమంలో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో దూలానికి ఉరేసుకున్నాడు. గంగాధర్ చిన్నమ్మ గమనించి వెళ్లి చూడగా కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. చుట్టుపక్కల వాళ్లను పిలిచి మెట్‌పల్లిలోని దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



నరేశ్ పార్థివ దేహంపై పూలమాల ఉంచుతున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

మల్యాల(కొడిమ్యాల), ఫిబ్రవరి 5: మల్యాల మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన నరేశ్ మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా, నరేశ్ పార్థివ దేహాన్ని బుధవారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సందర్శించి, నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ రామ్మోహన్‌రావు, సింగిల్ విండో చైర్మన్ అయిల్నేని సాగర్‌రావు, మాజీ సర్పంచ్ బద్ధం తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, నాయకుడు దేవరాజం, తదితరులున్నారు.



ఎన్నికైన మాల సంఘం సభ్యులు

## సంఘాలు-కార్యవర్గం

కొడిమ్యాల, ఫిబ్రవరి 5: మండలంలోని పూడూర్ గ్రామంలో మాల సంఘం కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆకుల అనిల్, ఉపాధ్యక్షుడిగా తాటి సుధాకర్, సభ్యులుగా ప్రవీణ్, సాయి, మధు, తాటి రాజేశం, క్యాదాసి ప్రణయ్, పరిపాటి అశోక్, తాటి రమేశ్, లక్ష్మీనారాయణ, అనిల్ ఎన్నికయ్యారు. అలాగే, గౌడ సంఘం కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చల్లూరి వెంకటేశంగౌడ్, ఉపాధ్యక్షులుగా గడ్డమీది మల్లేశంగౌడ్, డైరెక్టర్లుగా బుర్ర గంగయ్యగౌడ్, కందుల పరశురాములుగౌడ్, తీగల శ్రీనివాస్‌గౌడ్, గడ్డమీది మహేశ్‌గౌడ్, సుద్దపల్లి పరశురాములుగౌడ్, గడ్డమీది లక్ష్మీమాణిక్యం ఎన్నికయ్యారు.

## రేపు ఇసుక బహిరంగ వేలం

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి 5: రెవెన్యూ, పోలీసు శాఖ సంయుక్తంగా సీజ్ చేసిన అక్రమ ఇసుకకు ఈనెల 7న బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెట్‌పల్లి తహసీల్ కార్యాలయ ఆవరణలోని 16 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకకు శుక్రవారం ఉదయం 11 గంటలకు, ఆత్మనగర్‌లో సీజ్ చేసిన 24 ట్రిప్పుల ఇసుకకు మధ్యాహ్నం 12.30 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు మెట్‌పల్లి నాయబ్ తహసీల్దార్‌కు నిర్దేశిత సమయంలోపు రూ. 10 వేల ధరావతు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని సూచించారు.

**PUBLIC NOTICE**

Under the instructions of my client, **Mr.K.Vinay Kumar**, this notice is hereby given to the general public that my client is the owner of the property bearing Municipal House No.1-1-192/3/1, admeasuring 227.29 Sq.Yds, with a built up area of 820 Sq.Fts, situated at Korutla Town and Mandal, Jagitial District;having purchased the same videRegd. Sale Deed bearing Doc. No. 3034 of 2011dated 26-12-2011 from Mrs.ChandSulthana.

It is informed to the general public that, my client has lost/misplaced the original link title document of the property i.eRegd. Sale Deed bearing Doc. No. 1512 of 16-11-1994 in favour of Mr.M.Gangadhar and the same is not available in original with my client. Later Mr.M. Gangadhar has sold the property to Mr.G. Balaiah vide Registered Sale Deed bearing document No. 273 of 2008 and Mr.G.Balaiah has expired on 18-02-2009 leaving behind his wife Mrs.G.Ramanamma as his family member; however the Legal Heir Certificate/Family Member Certificate of Late.Mr.G.Balaiah is not available with my client.

It is informed that, any person who has found or who finds the above mentioned Original Title Deed, may return the same by way of registered post to the address given below or inform the undersigned by telephone and any person/(s) having any objections, claims, right, lien, title over the said property may please contact the under signed within 10 days from the date of publication of this notice with relevant documents in support of their claim.

Sd/- SRIRAM REGANI, Advocate.
Flat no # 307, MNK'S Vittal's Central Court
New Bhoiguda,Secunderabad
Contact # 9849781090
Date: 03-02-2025

## ఎస్సీ వర్గీకరణ నివేదిక ఆమోదంపై హర్షం

కోరుట్ల, ఫిబ్రవరి 5: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన నివేదికను ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ, అంబేద్కర్ యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పేట భాస్కర్ అన్నారు. పట్టణంలోని టీపీఎస్ జేఏసీ కార్యాలయంలో బుధవారం సంఘం జిల్లా అధ్యక్షుడు బోనగిరి మల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వర్గీకరణ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో రైతు విభాగం అధ్యక్షుడు ఎలిశెట్టి గంగారెడ్డి, నాయకులు శంకర్, షాహిద్ మహ్మద్ షేక్, రాజు, చందు, రాజేశ్, శేఖర్, గణేశ్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మల్లాపూర్, ఫిబ్రవరి 5: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ కోసం ఈనెల 7న హైదరాబాద్‌లో 'లక్ష డప్పులు-వెయ్యి గొంతుకల' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి మాట్ల బుచ్చయ్య తెలిపారు. మండల కేంద్రంలోని భరతమాత కూడలి వద్ద బుధవారం ఆయన సంఘ నాయకులతో కలిసి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్ల బుచ్చయ్య మాట్లాడుతూ, గ్రామాల నుంచి మాదిగ కులస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ నూతిపల్లి రాజం, నాయకులు పెద్దిరెడ్డి లక్ష్మణ్, నల్ల రాజేశ్వర్, ఎర్ర రాజు, మాట్ల సోమయ్య, శ్రీనివాస్, శంకర్, మల్లయ్య, గంగరాజం పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

కోరుట్ల, ఫిబ్రవరి 5: పట్టణంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ బీఎస్ లత బుధవారం పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. ఇక్కడ ఆర్డీవో జివాకర్ రెడ్డి, తహసీల్దార్ కిషన్, ఆర్ఐ రాజేందర్ రావు, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ గౌసూర్ రహ్మాన్ ఉన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగులకు అభినందన



ఆర్టీసీ ఉద్యోగులను అభినందిస్తున్న సంస్థ ఎండీ సజ్జనార్

జగిత్యాల, ఫిబ్రవరి 5: పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో ఓ ప్రయాణికురాలికి ఆర్టీసీ సిబ్బంది సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. ఇందుకు గానూ సంస్థ ఎండీ సజ్జనార్ బుధవారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో డిపో మేనేజర్ సునీత, ఉద్యోగులు కవిత, శ్రీనివాస్, బీఆర్ రావును శాలువాలతో సత్కరించి, అభినందించారు.

## కబడ్డీ క్రీడాకారులకు సర్టిఫికెట్లు ప్రదానం

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 5: లక్ష్మీపూర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన కబడ్డీ శిక్షణ శిబిరంలో నేర్చుకున్న క్రీడాకారులకు బుధవారం ప్రిన్సిపాల్ చైతన్యలత, కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బాలికలు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు.



క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

## మాజీ మంత్రిని కలిసిన ఆలయ కమిటీ సభ్యులు



మాజీ మంత్రి ఈశ్వర్‌కు ఆహ్వాన పత్రిక ఇస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పెగడపల్లి, ఫిబ్రవరి 5: పెగడపల్లి మండలం లింగాపూర్ గ్రామంలో ఈ నెల 8వ తేదీ నుంచి నిర్వహించే లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని బుధవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కరీంనగర్‌లోని నివాసంలో ఆలయ కమిటీ సభ్యులు కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కడారి మల్లయ్య, కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు గాండ్ల శ్రీనివాస్, రాయిల్ల రమేశ్, ఉప్పు నర్సయ్య, ఉప్పుగండ్ల నరేందర్‌రెడ్డి, కాశెట్టి వీరేశం, అన్నారపు కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



గంగయ్య కుటుంబసభ్యులకు చెక్కు అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

గొల్లపల్లి, ఫిబ్రవరి 5: మండలంలోని లొత్తునూర్ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉప్పరి గంగయ్య ఇటీవల మృతిచెందాడు. కాగా, బాధిత కుటుంబానికి బుధవారం పీఆర్టీయూ నాయకులు రూ. లక్ష చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు బోయినిపల్లి ఆనంద రావు, యాళ్ల అమర్‌నాథ్ రెడ్డి, సంది శ్రీనివాస్ రెడ్డి, అయిల్నేని రత్నాకర్ రావు, చీటి భూపతి రావు, వేణుగోపాల్ రావు, గుర్రం శ్రీనివాస్, నరేందర్, రాయిల్ల శ్రీనివాస్, దేవేందర్ పాల్గొన్నారు.

## కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్ అధికారి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 5: ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం మార్క్‌ఫెడ్ అధికారి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి నీరటి సురేందర్, సహకార సంఘం కార్యదర్శి మంత్రి సతీశ్‌కుమార్, సిబ్బంది రాంప్రసాద్, దినేష్, రాజేశ్, అర్జున్, సాయికుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణ మందు పిచికారీ

కథలాపూర్, ఫిబ్రవరి 5: కథలాపూర్ మండలం తాండ్ర్యాల గ్రామంలో బుధవారం పంచాయతీ అధికారులు దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. గ్రామంలో దోమల బెడద తీవ్రంగా ఉందని ప్రజలు తెలపడంతో అన్ని వాడల్లోని మురుగు కాలువల్లో దోమల నివారణ మందు స్ప్రే చేయించారు. ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, పంచాయతీ కార్యదర్శి రవీందర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

సారంగాపూర్, ఫిబ్రవరి 5: మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో బుధవారం ఆరుగురు లబ్ధిదారులకు రెవెన్యూ అధికారులు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో తహసీల్ కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్నారు.

## స్థలం కేటాయించాలి

పెగడపల్లి, ఫిబ్రవరి 5: మండల కేంద్రంలో సేవాలాల్ మహారాజ్ కమిటీ భవన నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలం కేటాయించాలని మండల గిరిజన నాయకులు బుధవారం తహసీల్దార్ రవీందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఎస్టీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు నగావత్ జీవన్‌నాయక్, ఏడుమోటలపల్లి మాజీ సర్పంచ్ అజ్మీరా హరిలాల్‌నాయక్, గిరిజన సంఘం నాయకులు నున్సావత్ చిరంజీవినాయక్, అజ్మీరా భూమానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 5: జిల్లాలో శిథిలావస్థలో ఉన్న నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం రాష్ట్ర స్థాయి పర్యవేక్షణాధికారి సురేందర్, జిల్లా సంక్షేమాధికారి బోనగిరి నరేశ్ సందర్శించారు. పూర్తిగా శిథిలావస్థలో ఉన్న భవనాల్లోంచి సెంటర్లను వేరే భవనంలోకి మార్చాలని, విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూపర్‌వైజర్లకు సూచించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించి, సూచనలు చేశారు.

## బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శికి సత్కారం

కోరుట్ల, ఫిబ్రవరి 5: పట్టణానికి చెందిన సుతారి రాములు బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. రాములును బుధవారం బీడీ కార్మికులు శాలువాతో సత్కరించారు. బీడీ కార్మికుల సంక్షేమం కోసం నిరంతరంగా పోరాటం చేస్తానని ఆయన తెలిపారు. ఇక్కడ బీడీ కార్మికులు ఉన్నారు.

## జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో ఖని చిన్నారుల సత్తా

కోల్‌సిటీ, ఫిబ్రవరి 5: తమిళనాడులోని మధురైలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి స్పీడ్ స్కేటింగ్-2025 పోటీల్లో గోదావరిఖని ఎస్‌టీకే అకాడమీకి చెందిన చిన్నారులు సత్తా చాటారు. ఈ పోటీల్లో రాష్ట్రం నుంచి 38 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అందులో గోదావరిఖని నుంచి శ్రీనిధి, గీతిక్ జైన్, సాయి రషితలు గోల్డ్ మెడల్స్ సాధించారు. సహస్ర, లక్కీ, హంసబ్ సాదీప్ (సిల్వర్), అబ్దుల్ మాలిక్ (రజత), అక్షయ సాయి, అకీరా నందన్ బ్రౌన్ మెడల్స్ సాధించారు. వీరిలో అకీరా నందన్, సాయి రషిత ఇండోనేషియాలో జరిగే అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలు బుధవారం గోదావరిఖనికి చేరుకోగా స్థానికులు ఘన స్వాగతం పలికారు.

## హద్దులు చూపించాలని వినతి

కొడిమ్యాల, ఫిబ్రవరి 5: చెప్యాల గ్రామ శివారులోని 60, 61వ సర్వే నంబర్లలో గతంలో బీసీ కాలనీకి భూమి కేటాయించారని, దానికి హద్దులు కేటాయించి అన్యాక్రాంతం కాకుండా చూడాలని ఆర్డీవో మధుసూదన్‌కు ఆర్టీఐ జిల్లా అధ్యక్షుడు అక్కపల్లి రవీందర్ బుధవారం వినతి పత్రం అందజేశారు. గతంలో బీసీ కాలనీకి కేటాయించిన స్థలంలో లబ్ధిదారులు ఇండ్లు నిర్మించుకోవడానికి పునాదులు తీశారని వినతి పత్రంలో పేర్కొన్నారు.

## పసుపు క్వింటాలు @ రూ.12,333

మెట్‌పల్లి, ఫిబ్రవరి 5: మెట్‌పలి వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం పసుపు కాడి (కొమ్ములు) క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.12,333, కనిష్ఠ ధర రూ.7,888 పలికింది. అలాగే, పసుపు గోళ (మండ)కు గరిష్ఠ ధర రూ.10,244, కనిష్ఠ ధర రూ.6 వేలు, పసుపు చూర క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ. 10,616, కనిష్ఠ ధర రూ.8,111 పలికినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు మార్కెట్‌లో 619 క్వింటాళ్ల పసుపు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.

## చౌలమద్దిలో పశువైద్య శిబిరం



పాడి రైతుకు నట్టల నివారణ మందు అందజేస్తున్న పశువైద్యాధికారులు

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి 5: మెట్‌పల్లి మండలం చౌలమద్ది గ్రామంలో పశువైద్య, పశు సంవర్ధక శాఖ, కోరుట్ల పశువైద్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని మెట్‌పల్లి ఏడీ డాక్టర్ బక్కయ్య, కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ శకారాం, డాక్టర్ అంబిక, డాక్టర్ శ్రీనివాస్ ప్రారంభించారు. 32 పశువులకు వివిధ పరీక్షలు చేసి, మందులు అందజేశారు. అలాగే, గొర్రెలు, మేకలకు వ్యాధి నివారణ టీకాలు వేశారు. మండల పశువైద్యాధికారి మనీషాపటేల్, వెటర్నరీ వైద్యులు హిమజ, అశోక్, కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సురేశ్ పాల్గొన్నారు.

## జిల్లా వెబ్ సైట్‌లో పూర్తి వివరాలు పొందుపరచాలి

పెద్దపల్లి, ఫిబ్రవరి5: జిల్లాలో ప్రభుత్వ పథకాలు, ఉద్యోగ ప్రకటనల పూర్తి సమాచారాన్ని జిల్లా వెబ్ సైట్‌లో పొందుపర్చాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం ఆయన అదనపు కలెక్టర్లు అరుణ శ్రీ, దాసరి వేణుతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లా అధికారులు అందించే సమాచారాన్ని ప్రతి సోమవారం వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. జిల్లా అధికారులు తమ కార్యాలయం ద్వారా నిర్వహించే పథకాలు, ఉద్యోగ ప్రకటనలకు సంబంధించిన బ్రోచర్లు, సమాచారాన్ని కలెక్టరేట్‌లోని హెల్ప్ డెస్క్‌కు అందిస్తే డిస్‌ప్లే చేస్తారని తెలిపారు.

## కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

పెద్దపల్లి, ఫిబ్రవరి5: ప్రయాగ రాజ్‌లోని మహా కుంభమేళాకు భక్తుల రద్దీ దృష్ట్యా తిరుపతి -దానాపూర్ మధ్య 4 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. ఈనెల 14న తిరుపతి -దానాపూర్, 17న దానాపూర్ -తిరుపతి, 18న తిరుపతి - దానాపూర్, 21న దానాపూర్ -తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. ఈ ఈ రైళ్లకు పెద్దపల్లి, రామగుండం రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించారు. ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

**LOSS OF RC**

★I CHILUKA HARISH, S/o. MURALIDHAR, R/o. Vidya Nagar, Karimnagar, my original RC No: "TS02FD6414" Motorcar was Lost. If found anyone Cont: 8125948101.
NTK-000

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189